క్లుప్తంగా

నేడు హైస్కూలు ప్లస్‌లో కెమిస్ట్రీ పోస్టు భర్తీకి చర్యలు

గుంటూరు ఎడ్యుకేషన్: కాకుమాను మండలం చినలింగాయపాలెంలోని జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన హైస్కూల్ ప్లస్ విభాగంలో కెమిస్ట్రీ పోస్టును భర్తీ చేసేందుకు శనివారం అర్హత గల స్కూల్ అసిస్టెంట్లు గుంటూరు డీఈవో కార్యాలయంలో హాజరుకావాలని డీఈవో పి.శైలజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు ఒరిజినల్ సర్టిఫికెట్లు, సర్వీసు రిజిస్టర్‌తో శనివారం ఉదయం 11 గంటలకు హాజరుకావాలని ఆమె సూచించారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ మృతి



తెనాలి రూరల్: చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న గుర్తు తెలియని మహిళ ఈ నెల 2న తెనాలి ఆర్టీసీ బస్టాండ్‌లోని విజయవాడ్ బుకింగ్ కౌంటర్ వద్ద అపస్మారకస్థితిలో ఉండడాన్ని ప్రయాణికులు గమనించారు. 108 అంబులెన్సుకు సమాచారమిచ్చి తెనాలి జిల్లా వైద్యశాలకు పంపారు. మెరుగైన చికిత్స కోసం వైద్యులు గుంటూరు పంపగా, అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిన్న పిల్లలకు ధ్యానంలో ఉచిత శిక్షణ

తెనాలి టౌన్: దసరా పండుగ సందర్భంగా శ్రీ ఆంజనేయం ధ్యానయోగ మండలి ఆధ్వర్యంలో ఈ నెల 15నుంచి 21 వరకు చిన్న పిల్లలకు ధాన్యంలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు చిల్డ్రన్స్ యోగా కన్వీనర్ కూరపాటి నాగరాజు శుక్రవారం తెలిపారు. గంగానమ్మపేటలోని చుండూరువారి సత్రం ప్రాంగణంలో ప్రతిరోజు ఉదయం ఆరు గంటల నుంచి ఏడు గంటల వరకు ధ్యానంలో శిక్షణ ఉంటుందన్నారు. ఐదు సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలు వయస్సు గల పిల్లలకు వారి తల్లిదండ్రులకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. యోగ మండలి వ్యవస్థాపకులు కిశోర్ గురూజీ శిక్షణ ఇస్తారని తెలిపారు. వివరాలకు 9440712208లో సంప్రదించాలని కోరారు.

బాలింతలకు పండ్లు, రొట్టెల పంపిణీ



తెనాలి టౌన్: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ వైద్యశాలలో బాలింతలు, గర్భిణులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ సభ్యుడు జి.వి.నారాయణ కుమారుడు పూర్ణచంద్ పుట్టిన రోజు సందర్భంగా సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పావులూరి రాంబాబు, అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీ కృష్ణ, కార్యదర్శి నల్లూరి వెంకటేశ్వరరావు, క్లబ్ సభ్యులు జి.వెంకటరత్నం, శంకరయ్య, తిరుపతయ్య, సురేష్‌కుమార్‌జైన్, ప్రతాప్, అన్నదాత సుఖీభవ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా ఊంజల సేవ



తెనాలి అర్బన్: బోసు రోడ్డులోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కొండపి వసుంధర ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం సత్యనారాయణస్వామి ఊంజల సేవ వైభవంగా నిర్వహించారు. మహిళలు సంకీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో అందె రాజేశ్వరి, కనకదుర్గ, సీహెచ్.నాగమల్లేశ్వరి, రత్నకుమారి, చిరంజీవి, నరసింహ, కొండపి శ్రీనివాసరావు, అందె బాలచంద్రమౌళి, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బైక్ అపహరణ

తెనాలి రూరల్: బైక్ అపహరణపై కేసు నమోదైంది. పట్టణ శాలిపేటకు చెందిన కొత్త రమేష్ ఈ నెల 1వ తేదీ రాత్రి బైక్‌ను ఇంటి ముందు నిలిపారు. మర్నాడు ఉదయం నిద్రలేచి చూడగా వాహనం కనబడలేదు. ఇన్నాళ్లు గాలించినా ఫలితం లేకపోవడంతో వన్‌టౌన్ పోలీసుల్ని శుక్రవారం ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు కర్పూరి ఠాగూర్ శత జయంతి

పాత గుంటూరు: అరండల్‌పేట వైన్ మర్చంట్ అసోసియేషన్ హాలులో ఈ నెల 8న బిహార్ మాజీ ముఖ్యమంత్రి జననాయక్ కర్పూరి ఠాగూర్ శత జయంతి ఉత్సవం నిర్వహించనున్నట్లు పి.వి. రమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సభలో వివిధ ప్రాంతాలకు చెందిన రాజకీయ ప్రతినిధులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి



వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, మేయర్ కావటి, ఎమ్మెల్యే ముస్తఫా, కమిషనర్ కీర్తి చేకూరి, నూరిఫాతిమా

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని రాజీవ్‌గాంధీ నగర్‌లో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా, నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు, కమిషనర్ కీర్తి చేకూరిలతో కలసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు ఉన్నత వైద్యం ఇంటి వద్దకే అందుతోందని కలెక్టర్ తెలిపారు. అనంతరం 53, 56వ డివిజన్లలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్ని ప్రభుత్వం నూతనంగా మంజూరు చేయడం ద్వారా పేదలకు వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో పేదల ఆరోగ్య రక్షణకు కృషి చేస్తోందని పేర్కొన్నారు. జగనన్న సురక్ష శిబిరాల్లో సిబ్బంది ఓర్పుతో ప్రజలకు సేవలందించాలని ఆయన సూచించారు. తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ ప్రజల వద్దకు పాలన తెచ్చిన విధంగా, ప్రజల వద్దకు వైద్యాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చారని తెలిపారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష అనారోగ్యంతో ఉన్న ప్రతి ఒక్కరికీ వరం వంటిదని చెప్పారు. కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పేదల ఆరోగ్యానికి రక్షగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ షేక్ సజిల, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రావణ్ కుమార్, డెప్యూటీ కమిషనర్ సీహెచ్.శ్రీనివాస్, ఎంహెచ్‌వో డాక్టర్ భాను ప్రకాష్, కార్పొరేటర్ మల్లవరపు రమ్య, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు అగ్గిపెట్టేరాజు, మెడికల్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తత అవసరం

నగర కమిషనర్ కీర్తి చేకూరి



ఎన్నికల సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

పాత గుంటూరు: ఎన్నికల సంఘం ఈ నెల 27న ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల చేస్తున్న నేపథ్యంలో ఓటర్ దరఖాస్తులు, క్లెయిమ్స్‌ని వెంటనే పరిష్కరించాలని బీఎల్‌వోలను నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్‌వో కీర్తి చేకూరి ఆదేశించారు. వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శుక్రవారం ఏఈఆర్‌వోలు, సూపర్వైజరీ అధికారులు, బీఎల్‌వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని రెండు నియోజకవర్గాల్లో ఇంటింటి సర్వేలో వచ్చిన దరఖాస్తుల్ని సత్వరమే ఆన్‌లైన్ చేయాలని బీఎల్‌వోలను ఆదేశించారు. ఎన్నికల విధులు ఎంతో అప్రమత్తంగా నిర్వహించాలని, నిర్లక్ష్యంగా ఉండే వారిపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. పెండింగ్ ఫారాల ఆన్‌లైన్ వేగంగా జరిగేలా సూపర్వైజరీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆమె చెప్పారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, సిటీప్లానర్ ప్రదీప్‌కుమార్, మేనేజర్ శివన్నారాయణ, సూపరింటెండెంట్లు సాంబశివరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

కార్పొరేటర్ల అర్జీల పరిష్కారంపై యాక్షన్ ప్లాన్

నెహ్రూనగర్: కార్పొరేటర్ల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీల పరిష్కారంపై వార్డుల వారీగా యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని విభాగాధిపతుల్ని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. తన చాంబర్‌లో శుక్రవారం నగర కార్పొరేటర్లతో వార్డుల్లో అభివృద్ధి పనులు, స్థానిక సమస్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజా ప్రతినిధులు ప్రజలతో మమేకమై ఉంటారని, వారు గుర్తించిన సమస్యల్ని వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇప్పటివరకు వార్డుల వారీగా కార్పొరేటర్లు అందించిన అర్జీలు, వాటి పరిష్కారంపై నివేదిక ఇవ్వాలని ఆయా విభాగాధిపతుల్ని ఆదేశించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే ప్రజా సమస్యలు పరిష్కారం, నగర సమగ్రాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. కార్పొరేటర్ల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదులు, ప్రతిపాదనల్ని క్రమపద్ధతిలో రికార్డ్ చేసి, తదుపరి చర్యలు వారికి తెలపాలని అధికారుల్ని ఆదేశించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

నెహ్రూనగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటిస్తూ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. తన చాంబర్‌లో శుక్రవారం నగర పాలక సంస్థ కాంట్రాక్టర్లతో కమిషనర్ స్పెషల్ గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంట్రాక్టర్ల సమస్యల్ని నిర్దేశిత గడువులో పరిష్కారం చేయాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. బిల్లుల చెల్లింపులో జాప్యం లేకుండా అన్ని స్టేజిల్లో వేగంగా రికార్డ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. వర్క్ అగ్రిమెంట్ పొందిన అభివృద్ధి పనుల్ని కాంట్రాక్టర్లు నిర్దేశిత గడువులోగా పూర్తి చేసినప్పుడే నగర అభివృద్ధి వేగంగా జరుగుతుందని తెలిపారు. బిల్లుల ఆన్‌లైన్ చేయడం, చెల్లింపుల్లో ఎదురయ్యే సమస్యల్ని ప్రతి శుక్రవారం జరిగే స్పెషల్ గ్రీవెన్స్‌లో తమ దృష్టికి తీసుకు రావచ్చని కాంట్రాక్టర్లకు సూచించారు.

సమస్యలను పరిష్కరించే గొప్ప ఆయుధం చిరునవ్వు



మాట్లాడుతున్న డాక్టర్ రవికుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: ఒత్తిడితో జీవితంలో ఎదురయ్యే సమస్యల్ని పరిష్కరించే గొప్ప ఆయుధం చిరునవ్వు అని ప్రముఖ వైద్యుడు డాక్టర్ వి.వి. రవికుమార్ తెలిపారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్స్ క్లబ్ ఆధ్వర్యంలో 'నవ్వండి –సంతోషంగా ఉండండి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ యాంత్రిక జీవితంలో మనస్సుకు, శరీరానికి మంచి ఔషధం నవ్వు మాత్రమేనని పేర్కొన్నారు. సినీ దర్శకుడు జంధ్యాల చెప్పినట్టు నవ్వడం ఒక యోగం, నవ్వించడం ఒక భోగం, నవ్వలేకపోవడం ఒక రోగంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్, గుంటూరు జిల్లా జాతీయ సేవా పథక కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ జేవీ సుధీర్ కుమార్, ఆర్. జయ శైలజ, సురేష్, స్వామి, కుమార్ రాజా, కె. శ్రావణి,విద్యార్థులు పాల్గొన్నారు

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో...

లక్ష్మీపురం: హాస్యం ఆప్తమిత్రుని వంటిదని మధుమేహ వ్యాధి నిపుణులు డాక్టర్ వి.వి రామ్‌కుమార్ తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రపంచ నవ్వుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. హాస్యం గొప్ప ఔషధంతో పాటు ఆరోగ్యదాయిని, ఆనందదాయినిగా పేర్కొన్నారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, హాస్య రచయిత బి.వి.రామ్‌కుమార్ మాట్లాడుతూ నవ్వు నాలుగు విధాలా చేటు అనేది పాత మాటనీ, నవ్వు నాలుగు విధాల గ్రేటు నేటి మాటని తెలిపారు.

నాయకుల దిగజారుడు వ్యాఖ్యలు తగదు

ఇటీవల కొందరు నాయకుల వ్యాఖ్యలు, వ్యక్తిగత దూషణలు శృతి మించి పోతున్నాయని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఖండించారు. అసభ్యకర విమర్శలు, తిట్ల పురాణాలు సభ్య సమాజం సిగ్గుతో తల దించుకునేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఐఐటీలో కాకుమాను యువకునికి బంగారు పతకం



హరీష్

కాకుమాను: మండల కేంద్రం కాకుమానుకు చెందిన బీటెక్ విద్యార్థి ఈపూరి హరీష్ 2023వ సంవత్సరంలో బీటెక్‌లో అత్యంత ప్రతిభ కనబరచి అధిక మార్కులు సాధించడంతో బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నాడు. శుక్రవారం వారణాసిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ బనారస్ హిందూ యూనివర్సిటీ(వారణాసి) ఆధ్వర్యంలో నిర్వహించిన 12వ స్నాతకోత్సవ వేడుకలలో భాగంగా డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ చైర్మన్ సమీర్ వి కవత్ చేతుల మీదుగా హరీష్ బంగారు పతకాన్ని అందుకున్నట్లు తండ్రి శ్రీనివాసరావు తెలిపారు. గతంలో కూడా హరీష్ 2022–23లో ఐఐటీలో అత్యధిక మార్కులు సాధించడంతో పాటు(9.84), బీటెక్ ఫైనల్ ఇయర్‌లో కూడా టాపర్‌గా నిలిచి మొత్తం ఆరు బంగారు పతకాలు, ఒక వెండి పతకాన్ని సాధించాడు. పదవ తరగతి నుంచి అతను అన్నింటిలో ప్రథమస్థానంలో నిలిచేవాడని శ్రీనివాసరావు తెలిపారు. ప్రస్తుతం హరీష్ హైదరాబాద్‌లోని మైక్రోసాఫ్ట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. హరీష్ తండ్రి శ్రీనివాసరావు మండలంలోని పెద్దివారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు. గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థికి బంగారు పతకం రావడంపై ఎంఈఓ కేఎఫ్.కెనడీ, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

సౌదీ కరెన్సీ పేరుతో మోసం

గుంటూరు ఈస్ట్: సౌదీ కరెన్సీ పేరుతో మోసం చేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆనందపేటకు చెందిన సయ్యద్ షంషీద్‌కు కొన్ని నెలల కిందట కృష్ణబాబునగర్‌లో నివసించే కలకత్తాకు చెందిన రాజు పరిచయమయ్యాడు. తన దగ్గర సౌదీ కరెన్సీ ఉందని చెప్పడంతో షంషీద్ గత నెల 24న రాజు వద్దకు వెళ్లి రూ. 4.50 లక్షలు ఇచ్చాడు. అందుకు రాజు కవర్‌లో చుట్టి ఉంచిన నోట్ల కట్టను షంషీద్‌కు ఇచ్చాడు. రూ. 4.50 లక్షల్ని ఇంట్లో పెట్టి వస్తానంటూ చెప్పి రాజు అక్కడి నుంచి పరారయ్యాడు. తర్వాత షంషీద్ కవర్ విప్పి చూడగా నోట్ల కట్టలో పైభాగంలో ఆరు సౌదీ కరెన్సీ నోట్లు మాత్రమే ఉన్నాయి. మిగిలినవి తెల్ల కాగితాలు ఉన్నాయి. షంషీద్ తాను మోసపోయినట్లు గుర్తించి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలిని మోసం చేసిన వ్యక్తిపై కేసు

వృద్ధురాలిని మోసం చేసిన వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఆంజనేయపేటకు చెందిన తులసమ్మకు పలు కారణాల రీత్యా పెద్దమొత్తంలో డబ్బులు వచ్చాయి. ఆమె మనవడి స్నేహితుడు కంకణాల రహీం అకౌంట్‌లో మార్చిలో రూ. 10 లక్షలు వేసింది. అనంతరం ఆ డబ్బులు డ్రా చేసి ఇవ్వాలని రహీంను కోరగా అతను వాయిదా వేస్తూ వచ్చాడు. చివరకు మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళను బెదిరించి నగదు, బైక్‌తో పరారీ

మహిళను అడ్డుకుని బెదిరించి ద్విచక్ర వాహనం, డబ్బులు, సెల్‌ఫోన్ లాక్కొని పారిపోయిన వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పిచుకలగుంట ప్రాంతంలో నివాసం ఉండే ఊటుకూరి డేవిడ్‌కు ఓ మహిళతో పరిచయం ఉంది. కొన్ని నెలలుగా ఆమె అతడితో విభేదించి దూరంగా ఉంటోంది. ఈనెల 4న రాత్రి మహిళ ద్విచక్ర వాహనంపై ఠాగూర్ బొమ్మ ప్రాంతంలో వెళుతున్న సమయంలో డేవిడ్ అడ్డుకున్నాడు. ఆమెను బెదిరించి రూ. 10వేలు, సెల్‌ఫోన్, ద్విచక్ర వాహనం లాక్కొని పారిపోయాడు. బాధితురాలు బంధువుల సహాయంతో డేవిడ్‌ను సంప్రదించినా స్పందించలేదు. దీంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసిన వ్యక్తిపై కేసు

గుంటూరు రూరల్: భూమి తమదని నకిలీ డాక్యుమెంట్స్ తయారు చేసిన నిందితులను నల్లపాడు పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన శుక్రవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం .. భూమి తమదని నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసి బోడపాటి రాంబాబు, నండూరి దేవయ్య తదితరులు తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అమరావతి రోడ్డు భారత్‌పేటకు చెందిన ఇబ్రాయిల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించి, కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

వీవీఐటీలో ఎక్సోషియా- 2023



పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో 5, 6 తేదీల్లో రెండు రోజుల పాటు సాంకేతిక సదస్సు ఎక్సోషియా- 2023 వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రాజెక్ట్ మాజీ మేనేజర్, టాటా ఎలక్ట్రిక్ కంపెనీ ఎస్ఎల్‌వీ కృష్ణారావు హాజరయ్యారు. నాలుగు అంశాలలో నిర్వహించిన సాంకేతిక పోటీల్లో 740 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఫ్యూజన్ విజన్, కాంపోనెస్ట్ క్వెస్ట్, బ్లైండ్ సర్క్యూట్స్, ఆప్టిక్ మిస్టరీ అంశాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాల్ని అందించారు. కృష్ణారావు మాట్లాడుతూ కోర్ బ్రాంచ్‌లకు ఎప్పటికీ ప్రాముఖ్యత ఉంటుందని అన్నారు. విద్యార్థులలో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించి నూతన ఆవిష్కరణల వైపు ఆలోచనలు మలిచేందుకు ఇటువంటి కార్యక్రమాలు తోడ్పడతాయని తెలిపారు. సాంకేతిక రంగంలో మార్పుల్ని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని ఆయన సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వై .మల్లికార్జునరెడ్డి, డీన్ అకడమిక్ డాక్టర్ కె.గిరిబాబు, డీన్ అడ్మిన్ డాక్టర్ ఎన్. కుమారస్వామి, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఏవీ నరేష్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు రోజులు నీటి సరఫరాలో అంతరాయం



పైప్‌లైను పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అహ్మద్

పొన్నూరు: పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలు పంపుహౌస్‌లో మెయిన్ పైప్‌లైనుకు ఏర్పడిన లీకు మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు వార్డులలో 07, 08 తేదీలలో తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్ తెలిపారు. 1 ,2, 3, 16, 17, 18, 19, 29, 30, 31 వార్డులతో పాటు నిడుబ్రోలులో నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. యథావిధిగా సోమవారం నుంచి నీటి సరఫరా జరుగనుందని తెలిపారు.

ఘనంగా శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, మేయర్ కావటి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ

పట్నంబజారు: శాసనమండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం బృందావన్ గార్డెన్స్‌లోని కార్యాలయంలో పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య ఆధ్వర్యంలో 650 కిలోల భారీ బర్త్‌డే కేక్‌ను ప్రజాప్రతినిధులు, నేతలు ఉమ్మడిగా కట్ చేశారు. సందడి వాతావరణంలో జన్మదినాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ రాజకీయంగా అప్పిరెడ్డి ఆలోచనలు చాలా ఉన్నతంగా ఉంటాయన్నారు. జన్మదిన శుభాకాంక్షలతో పాటు శాసనమండలి విప్‌గా నియమితులైన ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ స్వయంకృషితో ప్రభుత్వ విప్ స్థాయికి ఎదిగిన ప్రజా నాయకుడు లేళ్ల అప్పిరెడ్డి అని అన్నారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ పూర్తిగా ప్రజల కోసమే జీవించే నాయకుడు అప్పిరెడ్డిగా పేర్కొన్నారు. జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము), నగర డెప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు, షేక్ సజీల, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా మాట్లాడారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, జిల్లా వాణిజ్య మండలి అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు, పార్టీ నేతలు గులాం రసూల్, రాచకొండ జాన్‌బాబు, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్ దేవళ్ల రేవతి, పెద్ద సంఖ్యలో కార్పొరేటర్లు, పలు కార్పొరేషన్ డైరెక్టర్లు, పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

మిర్చి యార్డులో రక్తదాన శిబిరం

కొరిటెపాడు : ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం మిర్చి యార్డు ఆవరణలో వైస్ చైర్మన్ షేక్ మాబు సుభాని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని చైర్మన్ రాజనారాయణ ప్రారంభించారు. భారీ కేక్ కట్ చేశారు. అనంతరం అన్నదానాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి, మిర్చి దిగుమతి సంఘం అధ్యక్షుడు లేళ్ల పెద అప్పిరెడ్డి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు

పట్నంబజారు: శాసనమండలి ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. నగర డెప్యూటీ మేయర్ షేక్ సజీల కార్యాలయంలో కేక్ కట్ చేశారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

దివ్యాంగులకు దుస్తులు పంపిణీ

నెహ్రూనగర్: శాసన మండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య సహకారంతో దివ్యాంగుల విభాగం నాయకుడు బండారు దుర్గారావు ఆధ్వర్యంలో వంద మంది దివ్యాంగులకు బృందావన్ గార్డెన్స్‌లో దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో దివ్యాంగ నాయకులు చల్లా రామయ్య, జాన్‌సైదా పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలలో వేజండ్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులతో హెచ్ఎం , పీఈటీ

చేబ్రోలు: చేబ్రోలు మండలం వేజండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్–17 స్కూల్ గేమ్స్ వాలీబాల్ పోటీలలో స్థానిక వేజండ్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు పీఈటీ వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. బాలబాలికల వాలీబాల్ జట్టు ఎంపికలలో వేజండ్లకు చెందిన ఐదుగురు విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. మట్టుపల్లి సుమశ్రీ, షేక్ సోనీ, బింగినపల్లి మనీష, సీహెచ్ దుర్గా, ప్రసన్నలు రాష్ట్ర స్థాయిలో జరిగే వాలీబాల్ పోటీలకు జిల్లా జట్టు నుంచి పాల్గొంటారు. ఈ నెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు కడప జిల్లా మైదుకూరులో జరిగే పోటీలలో వీరు పాల్గొంటారు. హెచ్ఎం విజయశ్రీ, పీఈటీ వెంకటేశ్వరరావు, స్థానిక పెద్దలు తదితరులు అభినందించారు.

యువజనోత్సవ పోటీలకు విద్యార్థినుల ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వీఆర్ జ్యోత్స్నకుమారి

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి యువజనోత్సవ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి తెలిపారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో భాగంగా జానపద నృత్యం–వ్యక్తిగత పోటీలో విద్యార్థిని కె. నాగమల్లీశ్వరి జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వివరించారు. పోస్టర్ మేకింగ్, బృందగానం, సోలో గీతాలాపన విభాగాల్లో జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానాలు దక్కినట్లు తెలిపారు. కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మల్లీశ్వరిని ప్రిన్సిపాల్ వీఆర్ జ్యోత్స్నకుమారి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

అమరావతి రోడ్డులో ర్యాలీ

బీసీ కులగణన చేసిన బిహార్ నేతలకు పాలాభిషేకం



ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ సంఘాల నాయకులు

గుంటూరు రూరల్: విజయవంతంగా బీసీల కులగణన పూర్తి చేసిన బిహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ చిత్రపటాలకు బీపీ మండల్ కమిటీ నేతలు శుక్రవారం పాలాభిషేకం చేశారు. అమరావతిరోడ్డులోని ఇన్నర్ రింగ్‌రోడ్డులోగల బీపీ మండల్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన మద్దతు ర్యాలీలో బీపీ మండల్ విగ్రహ కమిటీ సభ్యుడు డాక్టర్ ఆలా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీసీ గణన జరిగించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా 50 శాతానికిపైగా ఉన్న బీసీలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ అవకాశాలు కల్పించకుండా రాజకీయ పార్టీలు అన్యాయం చేస్తున్నారన్నారు. ప్రధాని నరేంద్రమోదీకి బీసీ కుల గణన చేపట్టాలని విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. డాక్టర్ శేషయ్య, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో కూడా బీసీ కులగణన చేపట్టి బీసీలకు తగిన న్యాయం చేయాలని కోరారు. అనంతరం బీసీ కుల గణనకు మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు పూర్ణయ్య, టి.నరసింహారావు, బి.సాంబశివరావు, టి కేశవ, డాక్టర్ శివకుమార్, ఓర్సు ప్రేమ్‌రాజ్, వాసు, నీలాంబరం, కె శ్రీనివాసరావు పాల్గొన్నారు.